నిబంధనాలు!

సమీప గ్రామాలకూ అందని ఇసుక



అగనంపూడి ఇసుక డిపో

కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక పాలసీ వినియోగదారులకు గుదిబండగా మారింది. వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. అందరికీ ఇసుక దొరకడం గగనమైంది. ఫలితంగా నిర్మాణ దారులు అష్టకష్టాలు పడుతున్నారు. విశాఖ వాసులకే అగనంపూడి డిపో ఇసుక తీసుకెళ్లడానికి అవకాశం ఉండడంతో చెంతనే ఉన్న గ్రామాల వారు అదనపు భారం మోయాల్సి వస్తోంది. ఇదేమి నిబంధన అని మండిపడుతున్నారు.

- విశాఖ జిల్లా వాసులకే అగనంపూడి డిపో ఇసుక
- చెంతన ఉన్న గ్రామస్తులకూ ఇవ్వని వైనం
- నక్కపల్లి నుంచి తెచ్చుకోవాల్సిందే..
- అదనంగా రూ.5 వేల వరకూ భారం
- కాసుల వర్షం కురిపిస్తున్న లోకల్ నిబంధన

అగనంపూడి: ఇసుక డిపో చెంతన ఉన్న లంకెలపాలెం గ్రామస్తులకు ఇసుక గగనం కావడంతో మండిపడుతున్నారు. అగనంపూడి, లంకెలపాలెం గ్రామాల సరిహద్దుల్లో ఇసుక డిపో ఏర్పాటు చేశారు. ఈ డిపో విశాఖ జిల్లా పరిధిలో ఉండడంతో అనకాపల్లి జిల్లా పరిధిలోని లంకెలపాలెం వాసులకు ఇసుక అందని ద్రాక్షగా మారింది. లంకెలపాలెంతో పాటు పరవాడ, సబ్బవరం, అనకాపల్లి, అచ్యుతాపురం మండలాల వారు నక్కపల్లి డిపోకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో అదనపు భారం పడుతోంది. వీరికి నాలుగు నుంచి ఐదు వేల వరకు భారం పడుతుండడంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

నిరీక్షణ.. ట్రాఫిక్ తిప్పలు

రోజూ వందలాది లారీలు బారులు తీరి అగనంపూడి- లంకెలపాలెం మధ్య జాతీయ రహదారిపై నిలిచిపోతున్నాయి. దీంతో ఓ పక్క ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో అగనంపూడి నుంచి లంకెలపాలెం మూడున్నర కిలోమీటర్ల దూరం ప్రయాణానికి వాహనాలపై వెళ్లే వారికి 20 నిమిషాల సమయం పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే వాహన చోదకుల సహనానికి పరీక్షే అవుతుంది. మరో వైపు డిపోకు వచ్చిన లారీ లోడ్ కావడానికి రెండు నుంచి మూడు రోజుల పాటు పడిగాపులు కాయాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా కమిటీ తక్షణం స్పందించి డిపోలో సిబ్బందిని రెట్టింపు చేసి తొందరగా లోడింగ్ చేసి పంపించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఇసుక డిపో సమీపంలో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న వాహనాలు

లోకల్ దందా

ఎవరైనా ఇసుక కావాలంటే విశాఖ జిల్లాకు చెందిన ఆధార్ కార్డుతో బుక్ చేసుకుంటే తప్పా దొరకని పరిస్థితి. ఇదే అదునుగా భావించిన కొంతమంది లారీ ఓనర్లు, డ్రైవర్లు ఇసుక దందా కొనసాగిస్తున్నారు. వాస్తవంగా డిపో వద్ద టన్ను ఇసుక రూ.1076కు దొరుకుతుంది. గాజువాక ప్రాంతానికి పది టన్నులు ట్రాన్స్‌పోర్టుతో కలుపుకొని రూ.12వేలకు దొరికేది. వారం రోజుల వరకు ఇదే పరిస్థితి ఉండేది. అయితే భీమిలి డిపోలో నిండుకోవడం, ఈ డిపోకు తాకిడి పెరగడంతో ఈ ప్రాంతంలోని కొంతమంది లారీ ఓనర్లు, డ్రైవర్లు రింగ్‌గా ఏర్పడి విశాఖ జిల్లా ఆధార్ కార్డులతో ముందుగానే ఇసుక బుక్ చేసుకొని బ్లాక్‌లో రూ.18వేల నుంచి రూ.20 వేల వరకు అమ్ముకుంటున్నారు. దీంతో కృత్రిమ కొరత ఏర్పడుతోంది.



జాతీయ రహదారిపై భారీగా నిలిచిన లారీలు

అగనంపూడి డిపోకు పెరిగిన తాకిడి

గతంలో భీమిలి డిపోలో ఇసుక తక్కువ ధరకు లభ్యమయ్యేది. దీంతో విశాఖ జిల్లా వాసులు అక్కడి నుంచే ఇసుక తీసుకువెళ్లేవారు. దీంతో అక్కడ నిల్వలు నిండుకున్నాయి. తర్వాత జిల్లా కమిటీ అగనంపూడి, భీమిలిలో ఒకే విధమైన ధర నిర్ణయించారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి ఇప్పుడు అగనంపూడికి తాకిడి పెరిగింది.



అగనంపూడి డిపో వద్ద ఇసుక బుక్ చేసుకోడానికి వీఆర్వోల చుట్టూ చేరిన లారీ సిబ్బంది

ఇసుక కోసం పాట్లు



ఉచిత ఇసుక అంటూ ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి భిన్నంగా ఇక్కడ ఇసుక పాలసీ ఉంది. పక్కనే ఉన్న లంకెలపాలెం, ఇ.మర్రిపాలెం, గొన్నవానిపాలెం గ్రామస్తులకు కూడా ఇసుక అందడం లేదు. జిల్లాతో సంబంధం లేకుండా పరవాడ, అనకాపల్లి, అచ్చుతాపురం, సబ్బవరం మండలాల వాసులకు కూడా అగనంపూడి డిపోలో ఇసుక విక్రయించాలి. లేకపోతే లోడ్ ఇసుకపై నాలుగు నుంచి ఐదువేల అదనపు భారం పడుతుంది. ఇళ్లు మొత్తం పూర్తి అవ్వాలంటే కనీసం రూ.50వేల అదనపు భారం భరించాల్సి ఉంటుంది.

– వి.రామచంద్రరాజు, లంకెలపాలెం

మాకూ ఇసుక ఇవ్వాలి



పక్కనే ఉన్న మా గ్రామాలకు ఇసుక అందుబాటులో లేకపోతే ఉపయోగం ఏముంది. ఓ పక్క ఇసుక అందుబాటులో లేక, నిత్యం భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇసుక పరిసర గ్రామాలకు అందుబాటులోకి తేవాలి. బారుల తీరిన వాహనాలకు ప్రత్యామ్నాయం చూపించాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

– జి.శ్రీను, లంకెలపాలెం కాలనీ

క్లుప్తంగా

రోగులకు పండ్ల పంపిణీ



రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న అభిమానుల సంఘం

అగనంపూడి: సినీ హీరో, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా అభిమానుల సంఘం నాయకులు గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అగనంపూడి ఆస్పత్రిలోరోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. తర్వాత 70కిలోల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషా, అభిమానుల సంఘం ప్రతినిధులు పాముల వసంతరావు, మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీను, మంత్రి మురళీ, విందుల నారాయణ రావు, గవర వెంకటేశ్వరరావు, మండుగుల నూకరాజు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి టీవీ బహూకరణ



టీవీ చూస్తున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలు

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాల గల పిల్లలకు విద్యాబోధన మరింత మెరుగ్గా ఉండాలని, దివ్యాంగుల భవిష్యత్తు కోసం స్వచ్ఛంద సంస్థలు పాటు పడాలని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గొండేల త్రివేణి అన్నారు. ఆమె తన తల్లి అర్జునమ్మ జ్ఞాపకార్థం పెదగంట్యాడ భవిత కేంద్రానికి 32 ఇంచీల టీవీని గురువారం బహూకరించారు. ఆమె మాట్లాడుతూ టీవీ ద్వారా రైమ్స్, పాఠ్యాంశాలు పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయవచ్చన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు సూర్యనారాయణ, జయభారతి పాల్గొన్నారు.

అంధకారంలో జోనల్ కార్యాలయం



చీకట్లో జోనల్ కార్యాలయం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో గురువారం అంధకారంలో సాగింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు పదేపదే అంతరాయం ఏర్పడడంతో ఈ పరిస్థితి నెలకొంది. జోనల్ కార్యాలయంలో జనరేటర్ విద్యుత్‌ను కంప్యూటర్లకే పరిమితం చేయడంతో ఒకవైపు కారిడార్‌లో, మరోవైపు గదుల్లో సిబ్బంది చీకట్లోనే పని చేయాల్సి వచ్చింది. వివిధ సేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారు కూడా ఈ కారణంగా అవస్థలు పడ్డారు.

విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

గాజువాక : చదువులో ప్రతిభ ప్రదర్శిస్తున్న పేద విద్యార్థిని రొంగలి గేయశ్రీకు గాజువాక మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంబంధిత చెక్కును విద్యార్థిని బంధువులకు మానవతా స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ సుంకర నారాయణ ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీనంకొండ కృష్ణంరాజు, ఎం.వి.సుబ్బరాజు, బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పెదగంట్యాడ: ధాన్యంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అహింస పిరమిడ్ స్పిరిర్చువల్ ధాన్యకేంద్రం 14 వ వార్షికోత్సవాన్ని ట్రస్ట్ నిర్వహకుడు మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమని చెప్పారు. మనికి ఓర్పు, సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలని సూచించారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, నామకులు కరణంరెడ్డి నరసింగరావు, పల్లా కార్తీక్, వంశీకిరణ్, ట్రస్ట్ సభ్యులు సత్యవతి, రమణమ్మ, మోహన్, అప్పారావు,మూర్తి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న శివ గణేశ్వరరావు తదితరులు

29న సామూహిక సత్యనారాయణ వ్రతం

గాజువాక: వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలోఈ నెల 29న నిర్వహించనున్న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం పోస్టర్‌ను గాజువాకలో గురువారం మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాసవీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాజువాక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు గుండా శరత్‌చంద్రగుప్త, నంబూరి జగన్నాథరావు, కులుకూరి మంగరాజు, సింగంశెట్టి సతీష్ కుమార్, చెక్క బంగార్రాజు, గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్త, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి తదితరులు

పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకం

మల్కాపురం : పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం హెచ్‌పీసీఎల్‌లోని ఎల్ అండ్ టీ సంస్థ ఐటీటీపీ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ స్కూళ్లకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా భూగర్భ జలాల రక్షణకు కాలుష్యరహిత వాతావరణానికి మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ అండ్‌టీ మేనేజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కార్మికులపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలి

మహాధర్నాలో స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకుల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం బలవంతపు ఆర్థిక ఆంక్షలు ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతకాని వైఖరి వల్ల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నారన్నారు. ముడి పదార్థాలు సమకూర్చలేని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం సిగ్గుచేటన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే ప్లాంట్ మనుగడ సాధిస్తుందన్నారు. అదే విధంగా నిర్వాసితుల ఉపాధి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముందు ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

వేతనాలు పెంచకపోగా.. కోతలా!

సెయిల్‌తో సమానంగా వేతన సవరణ జరగాల్సి ఉండగా ఇక్కడ ఉన్న వేతనాలపై ఆంక్షలు విధించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు యాజమాన్యం ప్రతీ నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ఆర్థిక ఆంక్షల ప్రతిపాదనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లోకి నాయకులు వెళ్లకుండా పెద్ద ఎత్తున పోలీసు సిబ్బందిని మోహరించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ధర్నాలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జెర్రిపోతుల ముత్యాలు, ఎస్. రామారావు, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, డి.వి. రమణారెడ్డి, సురేష్‌బాబు, పరంధామయ్య, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

గాజువాక: అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి కోరారు. ఈ ప్రమాదంలో 18 మంది దుర్మరణం పాలయ్యారని, మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు రూ. కోటి చొప్పున, గాయపడినవారికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న బ్యాంక్ మహిళా ఉద్యోగులు

డాబాగార్డెన్స్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, మహిళల భద్రతకు తక్షణం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భయ చట్టం ఉన్నప్పటికీ మహిళలపై ఇటువంటి దాడులు జరగడం హేయనీయమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో మహిళలపై దాడులు నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సంఘం నాయకులు కమలాకర్, ఆడారి శ్రీను, రమేష్, ఈశ్వర్, ప్రసాద్, సుజాత, ప్రత్యూష, ప్రసన్న లక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబోయ్ పందులు



చెత్తను చిందర చేస్తున్న వరాహాలు



భానోజీతోట ప్రాంతంలో గుంపులుగా సంచరిస్తున్న పందులు



నడుపూరు గెడ్డ పక్కన తిష్టవేసిన పందులు

వీధుల్లో గుంపులుగా సంచారం

పెదగంట్యాడ: పందులు ప్రాణాంతక వ్యాధులకు కేరాఫ్...అవి సంచరించే చోట రోగాలు చాపకింద నీరేన్నది జగమెరిగిన సత్యం. అలాంటి పందుల సంచారం సమస్యాత్మకంగా మారింది.. ఇవి గుంపులుగా జనావాసాల మధ్య తిరుగుతుండటంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. రోడ్లపైనే తిష్ట వేసి రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నాయి. వాహనచోదకులకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ ప్రాంతాల్లో అధికం

జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోట రోడ్ నెంబర్–5లో ఓ క్యాటరింగ్ పక్కన అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో, 76 వార్డు పరిధిలో నడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో పందులు అక్కడే సంచరిస్తూ వాహనాలకు అడ్డుపడుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి పందుల బెడదకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం

పాపా హోమ్ చిన్నారులతో సివిల్స్ ర్యాంకర్ పూసపాటి సాహితి

డాబాగార్డెన్స్: సివిల్స్ ఐఎఫ్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించిన పూసపాటి సాహితి గురువారం పాపా హోమ్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్లి బంగారు భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇతర విషయాలు పక్కన పెట్టి కష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు చేరుకోగలరని సూచించారు. పాపా హోమ్ విద్యార్థుల కోసం రూ.10 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సాహితి అందజేశారు. విద్యార్థులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సాహితీని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



సివిల్స్ 24వ ర్యాంకర్ సాహితిని సత్కరిస్తున్న పాపా హోమ్ కమిటీ సభ్యులు

గ్రంథాలయాలతోనే అభివృద్ధి

సీతమ్మధార: విశాఖపట్నం అభివృద్ధిలో గ్రంథాలయాలూ ముఖ్యమేనని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.వి జయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు. ఇక్కడికి ఎన్నిసార్లు వెళ్తే అన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత గ్రంథాలయానికి వెళ్లడం మానేయడం సరికాదని హితవు పలికారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పాత పేపర్లు సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని సూచించారు. పౌర గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు, మంచి సదుపాయాలున్నాయని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్. వర్మ, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్